

561మందికి ఉత్తమ సేవా పురస్కారాలు

పుట్టపర్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలందించిన 561 మందిని ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేశారు. పుట్టపర్తిలోని శిరాసాని హిల్స్ వద్ద పోలీస్ పెరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించే గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఇందులో జిల్లా స్థాయి ఉన్నతాధికారులతోపాటు డివిజన్, మండల స్థాయిలో పలు శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపిక చేశారు.

సర్వం సిద్ధం

- నేడు గణతంత్ర దినోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

జిల్లాపోలీసు పరేడ్ మైదానంలో కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న గౌరవ వందనం రిహార్సల్స్





పోలీసుల రిహార్సల్స్



భారత రాజ్యాంగం నమూనా

పుట్టపర్తిరూరల్, జనవరి 25ః(ఆంధ్రజ్యోతి) గణతంత్ర దినోత్సవానికి అధికారులు జిల్లా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈక్రమంలోనే స్థానిక శిరసాని పోలీసు పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఉదయం ఈ మైదానంలోనే జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లా అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టరు వివరిస్తారు. ఆతర్వాత ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, అనంతరం పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు కొన సాగుతాయి. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానం చేస్తారు. పోలీసు పరేడ్ మైదానంలో శనివారం సాయంత్రం గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన రిహార్సల్స్‌ను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఇందులో భాగంగా జాతీయ పతాక ఆవిష్కరణ, పరేడ్ రిహార్సల్స్ అతిథుల గ్యాలరీలు, స్టాల్స్, డాగ్‌స్క్వాడ్ విన్యాసాలను పరిశీలించారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు హాజరువుతున్నందున ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూలకుంటలో బాణసంచా పేలుస్తున్న అభిమానులు

బాలయ్య.. పద్మ భూషణ్

- ఎన్టీఆర్ వారసుడికి అరుదైన గౌరవం
- జిల్లా వ్యాప్తంగా అభిమానుల సంబరం



హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. విషయం తెలియగానే ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కొల్లకుంటలో బాలకృష్ణ అభిమాని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప కేక్ కట్ చేసి పంచిపెట్టారు. హిందూపురం మండలం పూలకుంటలో సర్పంచ్ మంజునాథ్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

(వివరాలు 8లో)

- ఆంధ్రజ్యోతి, హిందూపురం



కొల్లకుంటలో కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు

పాఠం నేర్పేదెవరు..?

- పాఠశాలల్లో అకృత్యాలు, నేరాలు
- పురోగతి లేని జవాబుపత్రాల దహనం కేసు
- నాడు నేడు పనుల్లో అవకతవకలు
- ఉపాధ్యాయురాలిని వేధించిన హెచ్‌ఎంపై చర్యలు ఏవీ?
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కదిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజ నిర్మాణంలో బడి పాత్ర చాలా కీలకం. అలాంటి బడికే నేటి పరిస్థితుల్లో భద్రత కరువవుతోంది. ఏమాత్రం సమంజసం కాని సంఘటనలు జరుగుతున్నాయి. ఘటన జరిగిన సమయంలో నానా హడవుడి చేసిన అధికారులు, పాలకులు ఆనక దాని గురించి పట్టించుకోవడం మానేశారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినవస్తున్నాయి. ఇందుకు గత కొంతకాలంగా జరుగుతున్న సంఘటనలు అద్దం పడుతున్నాయి.

పురోగతి లేని, జవాబుపత్రాల దహనం కేసు

గత ఏడాది డిసెంబరు 22న ఓబుళదేవరచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థుల జవాబు పత్రాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఈసంఘటన జరిగి నెల గడిచినా, ఈకేసులో ఎలాంటి పురోగతి లేదు. బాధ్యులను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినవస్తున్నాయి. జవాబు పత్రాలు మాత్రమే కాల్చివేశారు కాబట్టి సరిపోయింది. ఉపాధ్యాయుల, విద్యార్థుల రికార్డులను కాల్చిఉంటే వారి భవిష్యత్ ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయుల ఎస్‌ఆర్‌లు, విద్యార్థుల టీసీలు, ఇతర రికార్డులు కూడా పాఠశాలో ఉంటాయి. వాటికి ఏదైనా జరిగి ఉంటే పరిస్థితి ఏమిటన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పాఠశాలలో ఈసంఘటన జరగడానికి వారం ముందు కిటికీ ఊచలను తొలగించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈసంఘటన జరిగిన తరువాతైనా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కానీ, ఇతర సిబ్బందికానీ ఎందుకు అప్రమత్తంగా ఉండలేకపోయారన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

ఉపాధ్యాయురాలికి హెచ్‌ఎం వేధింపులు

పట్టణంలోని ఓపాఠశాలలో పని చేస్తున్న తనను అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేధిస్తున్నట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికకు ఉపాధ్యాయురాలు ఉత్తరం పంపారు. తనను అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు ఆమె ఆ ఉత్తరంలో పేర్కొన్నారు. మధ్యాహ్నభోజనం పిల్లలకు సరిపడా చేయించాలని కోరడమే ఆ ఉపాధ్యాయురాలు చేసిన నేరం. ఈ ప్రధానోపాధ్యాయుడు అక్కడ పనిచేసే ఇతర ఉపాధ్యాయురాళ్లను కూడా వివిధ సందర్భాల్లో వేధిస్తున్నట్లు ఎంఈఓ విచారణలో చెప్పారని ఉత్తరంలో తెలిపారు. తనకు జరిగిన వేధింపులు, అన్యాయంపై ఎంఈఓకు తెలిపినా, ఇంతవరకు ఉన్నతాధికారులనుంచి ఆయనపై ఎటువంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తు 'ఆంధ్రజ్యోతి'కి ఉత్తరం పంపారు. మీద్వారా నైనా న్యాయం చేయాలని కోరారు.

నాడు నేడు పనుల్లో అవకతవకలు

కదిరి మండలంలోని దిగువపల్లి, కౌలేపల్లి కాలనీ పాఠశాలల్లో నాడు నేడు పనులకు నిధులు మంజూరయ్యాయి. దిగువపల్లి పాఠశాలకు విడుదలైన నిధులను అక్కడ పనిచేసే ప్రధానోపాధ్యాయుడు దుర్వినియోగం చేయగా, దాన్నిగుర్తించిన ఉన్నతాధికారులు అతడిపై వేటు వేశారు. ఆతరువాత మరో ఉపాధ్యాయుడికి నిధులు ఖర్చు చేయాలని ఇన్‌చార్జ్ ఇస్తే ఆయన కూడా దాదాపు రూ.48వేలు స్వాహా చేసినట్లు తెలిసింది. ఇతడిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదని సమాచారం. అలాగే కౌలేపల్లి కాలనీ పాఠశాలలోకూడా ప్రధానోపాధ్యాయులు నిధులను దుర్వినియోగం చేసినట్లు తెలిసింది.



ఓడీసీ జిల్లా పరిషత్ పాఠశాలలో దహనమైన జవాబుపత్రాలు(ఫైల్)

అనుమతి లేకుండానే చెట్లు తొలగింపు

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అనుమతిలేకుండానే రెండు చెట్లను గత వారం తొలగించారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలంను వివరణ కోరగా చెట్లు ఎండిపోవడంతో కొమ్మలు విరిగి విద్యార్థుల మీద పడుతున్నాయని, ఇది గమనించి చెట్లును తొలగించామన్నారు. తొలగించిన కలపను వేలం వేసి, పాఠశాల ఖాతాలో జమ చేస్తామన్నారు.

దోషులను పట్టుకుంటాం

జవాబుపత్రాల దహనం కేసులో పాఠశాల ఉపాధ్యాయులతోపాటు, సిబ్బందిని విచారించాం. మండలకేంద్రంలో ఫోన్‌నెంబర్ల ఆధారంగా అనుమానమున్న వారిని కూడా విచారించాం. క్లూస్‌టీమ్ ద్వారా వేలిముద్రలు పరిశీలించాం. ఈ కేసులో అనుమానితులు దొరకలేదు. మరింత లోతుగా విచారణ చేసి, దోషులను పట్టుకుంటాం.

- టి. మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ, ఓడీసీ

నివేదికలు పంపాం

పట్టణంలోని ఓపాఠశాలలో ఉపాధ్యాయురాలిను ప్రధానోపాధ్యాయుడు వేధించినట్లు ఫిర్యాదు వచ్చింది. స్వయంగా వెళ్లి విచారించాం. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నాడు నేడు పనుల్లో నిధులు దుర్వినియోగం చేసినట్లు మా దృష్టికి వచ్చింది. విచారణ చేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

- చెన్నకృష్ణ, ఎంఈఓ

ఓటు హక్కు వజ్రాయుధం: కలెక్టర్ చేతన్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వజ్రయుధంలాంటిదని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటే అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును బాధ్యతయుతంగా వినియోగించుకోవా లని సూచించారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా ఓటు హక్కును వినియోగించాలన్నారు. ఎన్నికలు ఐదు సంవత్సరాలకు ఒకసారి వస్తాయని, ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, ఓటు హక్కు ద్వారా సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాలన్నారు. వందశాతం ఓటు హక్కును వినియోగించినప్పుడే దేశానికి సమర్థవంతమైన నాయకత్వం వస్తుందన్నారు. ఓటు హక్కుపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి పలు శాఖల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విమానాశ్రయ భద్రతపై సమీక్ష

పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయ భద్రతపై కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులతో శనివారం సమీక్షించారు. విమానాశ్రయంలో భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయంలో భద్రతపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏఏ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాపై సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయ నిర్వాహకుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. సమాచార బదిలీతో భద్రత ప్రమాణాలు పెంచాలని సూచించారు. అనంతరం విమానాశ్రయ సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు.

విజేత సూపర్‌మార్ట్ ప్రారంభం



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ



సూపర్ మార్ట్‌ను సందర్శిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులో విజేత సూపర్‌మార్ట్‌ను ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ శనివారం ప్రారంభించారు. వ్యాపారపరంగా అనంతపురం విస్తరిస్తోందని అన్నారు. నాణ్యత, నమ్మకానికి బ్రాండ్‌గా ఉండేలా విజేత సూపర్‌మార్ట్‌లను ఎండీ జగన్మోహన్‌రావు అన్ని జిల్లాల్లోనూ విస్తరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో విజేత మార్ట్ నిర్వాహకులు సందీప్, హరికృష్ణ, టీడీపీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, ఆదినారాయణ, సరిపూటి రమణ, రాయల్ మురళి, టీఎన్ఎస్ఎఫ్ లక్ష్మీనారాయణ, కూచె హరి, బుగ్గయ్య చౌదరి, నెట్టెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు ఆంజనేయుడికి విశేష పూజలు

బొమ్మనహాళ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు, పవన్ కుమార్ పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తరం జరిపించి పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

నెట్టికంటికి వెండి రథ ప్రాకారోత్సవం





అలంకారాలలో స్వామివార్లు.. కసాపురం ఆలయంలో వెండి రథ ప్రాకారోత్సవం

గుంతకల్లు, జనవరి25(ఆంధ్రజ్యోతి): కసాపురం ఆలయంలో శనివారం స్వామివారికి వెండి రథ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 6-40 గంటలకు అర్చకులు సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయుల ఉత్సవ విగ్రహాలకు సర్వాంగ సుందరంగా అలంకారాలు చేసి వెండి రథంపై ఆశీనులను చేశారు. ఆలయ ఈఓ వాణి ఆధ్వర్యంలో స్వామివార్ల వెండి రథ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు పిడికిటి వెంకటేశ్వరులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏమార్చి లూటీ!

ఏటీఎం కార్డు మార్చి డబ్బు కాజేస్తున్న దుండగులు



ఎంగిలిబండ రాజుకు చెందిన ఏటీఎం కార్డు మారుస్తున్న దుండగులు



ఏటీఎం కార్డు వాడటం రాని అమాయకులకు సాయం చేస్తున్నట్లు నటించి, బురిడీ కొట్టించే ఘటనలు జిల్లాలో ఇటీవల ఎక్కువ అయ్యాయి. గుత్తి పట్టణ పరిధిలోనే ఇటీవల వరుసగా నాలుగు ఘటనలు జరిగాయి. గత ఏడాది జూలై నుంచి గుత్తి పట్టణ పరిధిలోనే 15 ఘటనలు జరిగాయి. ఐదు నెలల కిందట తాడిపత్రి పట్టణ పరిధిలో నలుగురు ఇలానే మోసపోయారు. రెండు నెలల కిందట ఉరవకొండలో రైతును ఓ దుండగుడు ఇలానే మోసం చేశాడు. మోసపోయామని బయటకు చెప్పుకోలేని బాధితులు ఎంతో మంది ఉన్నారు. కొందరు ఆగంతకులు నకిలీ కార్డులతో ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాస్తున్నట్లు తెలుస్తోంది. గంటలకొద్దీ వేచి చూసి ఏటీఎంను ఆపరేటింగ్ చేయడం రాని వారిని మోసగిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి అనంతపురం క్రైం

- డబ్బు డ్రా చేయడం రాక వారికిస్తే అంతే సంగతి
- ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాస్తున్న 'వేటగాళ్లు'
- అమాయకులే వారి టార్గెట్
- గుత్తిలో జూలై నుంచి 15 సంఘటనలు
- ఐదు నెలల కిందట తాడిపత్రిలో నాలుగు...

ఎలా బురిడీ కొట్టిస్తారంటే...

దుండగులు ఏటీఎం సెంటర్ల వద్దే ఉంటారు. నగదు డ్రా చేస్తున్నట్లో.. క్యాష్ చెక్ చేస్తున్నట్లో నటిస్తుంటారు. లేదా అక్కడే ఫోన్‌లో మాట్లాడుతూనో కనిపిస్తారు. వారు ఏటీఎం ఆపరేట్ చేయడం రాని వ్యక్తుల ముఖకవళికలను సులభంగా కనిపెట్టేస్తారు. ఎవరైనా డబ్బు తీసిస్తారా...? అని అడగడం ఆలస్యం... వెంటనే ముందుకు వస్తారు. తొలుత వారి ఏటీఎంల ద్వారా మిషన్‌లో కార్డు పెట్టి పాస్ వర్డ్ కనుక్కుంటారు. కానీ డబ్బు విత్ డ్రా చేయరు. సర్వర్ సమస్య వస్తుందని కహానీలు చెబుతారు. ఇంకా కొంచెం టైం పడుతుందని చెబుతారు. నాకూ పనుందని చెప్పి, నకిలీ కార్డు చేతిలో పెట్టి వెళ్తారు. అలా బయటకు వెళ్లిన కొంతసేపటికే మరో ఏటీఎంలో డబ్బు డ్రా చేస్తారు. దుండగుడు కార్డు ఇచ్చేటప్పుడే దాన్ని చెక్ చేసుకుంటే మోసపోయే అవకాశం తగ్గుతుంది.

బ్యాంకుల నిర్లక్ష్యం

ఏటీఎంల వద్ద బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ సెక్యూరిటీ గార్డులు లేకపోవడంతోనే ప్రజలు అపరిచితులను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని ఏటీఎం సెంటర్లలో గార్డులున్నా ఆగంతకులు అక్కడే తచ్చాడుతుంటారు. అయినా వారిని ప్రశ్నించడంలో గార్డులు విఫలమవుతున్నారు. బాధితులు ఇలా మోసపోకుండా బ్యాంకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

గర్భిణి అన్న కనికరం లేకుండా..!

గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఇండియన్ ఏటీఎం సెంటర్లో ఓ మహిళ నుంచి ఏటీఎం కార్డు మార్చి రూ.50వేలు సొమ్ము దోచేశారు. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురానికి చెందిన చిలకల వేదవతి(గర్భిణీ) డెలివరీ కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఈనెల 21డబ్బు అవసరమై మరో మహిళతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లోని ఇండియన్ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ ఆగంతకులు ఏటీఎం కార్డు మార్చారు. నకిలీ కార్డు ఆమెకిచ్చారు. కానీ 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఆమె ఏటీఎం కార్డు ద్వారా రూ.50వేలు డ్రా చేశారు.



గద్దల లక్ష్మీదేవి ఏటీఎం కార్డు అపహరిస్తున్న దుండగుడు

- తాడిపత్రి పట్టణంలో ఐదు నెలల కిందట నెలన్నర వ్యవధిలో ఆరు సంఘటనలు ఇలాంటివే జరిగాయి. రాఘవయ్య అనే బాధితుడు రూ.40వేలు నష్టపోయాడు. మరో వ్యక్తి ఏటీఎంను ఏమార్చి రూ.20వేలు డ్రా చేశారు. మరో నలుగురి నుంచి రూ.80డ్రా చేసినట్లు బాధితులు వాపోయారు.

- ఈనెల 10వతేదీ గుత్తి పట్టణానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి తన భర్తతో ఏటీఎం కార్డు ఇచ్చి పంపింది. రూ.3వేలు డ్రా చేయమని చెప్పింది. ఏటీఎం సెంటర్‌లో ఆపరేటింగ్ చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని అతడు సాయం అడిగాడు. ఇదే అవకాశంగా భావించిన ఆ యువకుడు వృద్ధుడిని మభ్యపెట్టాడు. పాస్ వర్డ్ తెలుసుకుని అందులో టైప్ చేశాడు. కానీ నగదు డ్రా చేయలేదు. సర్వర్ బిజీగా ఉందని, మళ్లీ తీసుకోవాలని, తనకు పనుందని బయటకు వెళ్లిపోయాడు. అయితే ఆ వృద్ధుడి ఏటీఎం కార్డు గుట్టుగా తనవద్ద ఉంచుకుని మరో కార్డు అతడి చేతిలో పెట్టాడు. కొంతసేపటికే ఆ దుండగుడు మరో ఏటీఎంలో రూ.9300 డ్రా చేశాడు. నగదు డ్రా అయినట్లు వృద్ధుడికి మెసేజ్ రావడంతో ఆందోళన చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.
- ఈనెల 17న గుత్తి రూరల్ మండల పరిధిలోని ఎంగిలిబండకు చెందిన రాజు మోసపోయాడు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం రాజు, భార్య లక్ష్మి పేరుతో తొండపాడు కెనరా బ్యాంకులో స్వయం సహాయక గ్రూపులోని పొదుపు సొమ్ము రూ.1.26లక్షలు రుణం తీసుకున్నారు. గుత్తిలోని ఏటీఎం సెంటర్‌కు డబ్బు డ్రా చేయ డానికి వెళ్లాడు. ఈ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు డ్రా చేయడానికి సాయం చేస్తామన్నారు. ఆ ముసుగులో పాస్‌వర్డ్ తెలుసుకున్నారు. వారి దగ్గరున్న నకిలీ ఏటీఎం కార్డు రాజుకు ఇచ్చి, అతడి కార్డుతో వెళ్లిపోయారు. ఆ దొంగలు అదే రోజు కర్నూలు నగరంలోని ఓ ఏటీఎంలో రూ.1.26లక్షలు డ్రా చేసుకున్నారు. మూడు రోజుల తరువాత రాజు గుత్తికి వచ్చి ఏటీఎం మరో వ్యక్తితో చూపించాడు. కానీ అది నీది కాదని, పాస్‌వర్డ్ సెట్ కాలేదని చెప్పడంతో అది నకిలీదిగా తేలడంతో రాజు నిర్ఘాంతపోయాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.
- చదువురాని వారు మోసపోతున్నారంటే అవగాహన లేదనుకోవచ్చు. కానీ యానిమేటర్లు కూడా మోసపోతుండటం విస్తు గొలుపుతోంది. గత ఏడాది జూలై11న వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేస్తున్న యానిమేటర్ గద్దల లక్ష్మి ఇలానే మోసపోయింది. గుర్తు తెలియని వారిని నమ్మి ఏటీఎం కార్డు అందజేసి రూ.47వేలు డ్రా చేయడంతో లబోదిబోమంది.
- రెండు నెలల కిందట యాడికికి చెందిన ఈశ్వరయ్యకు చెందిన ఏటీఎం కార్డు మార్చి దుండగులు రూ.46వేలు డ్రా చేసుకున్నారు.
- గత ఏడాది ఆగస్టు 31న పి.ఎర్రగుడుకు చెందిన శ్రీనివాసులు నుంచి రూ.24వేలు డ్రా చేశారు. ఏటీఎం కార్డుతోనే అతనూ మోసపోయాడు.
- ఉరవకొండలో గత ఏడాది నవంబరులో ఓ పల్లెటూరి పెద్దమనిషి ఏటీఎం వద్దకు వెళ్లాడు. డబ్బు తీయిస్తానని చెప్పి న ఆ అగంతకుడు మెషీన్ సరి గా పనిచేయడం లేదని చెప్పి ఏటీఎం కార్డు మార్చి వెళ్లాడు. కొంతసేపటికే మరో ఏటీ ఎం నుంచి రూ.79వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. దీంతో ఆ పెద్దమనిషి లబోదిబోమని పోలీసులను ఆశ్రయించాడు.



బ్యాంకులో సీసీ పుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

కేసులు...ఉత్తుత్తేనా..?

ఏటీఎంల వద్ద కార్డుల ద్వారా మోసపోతున్న బాధితులు చాలా మందే ఉంటున్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తున్నప్పుడు వివరాలు రాసుకుని, ఏటీఎం సెంటర్లలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. కానీ అక్కడికే పరిమితమై కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కేసులు కడితే తప్పనిసరిగా దుండగులను పట్టుకోవాలి. లేకుంటే అవి పెండింగ్ కేసుల జాబితాలో ఉండే ప్రమాదం ఉంది. ఇవి ఉన్నతాధికారులతో తలనొప్పికి దారి తీస్తాయని కేసులు నమోదు చేయడం లేదని సమాచారం. అలాంటి వాటిపై పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటివరకు ఏటీఎం మోసాలకు సంబంధించి పోలీసులు దుండగులను అరెస్ట్ చేసిన దాఖలాలు లేదా రికవరీ చేసిన వ్యవహారాలు లేవు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినంతకాలం ఏటీఎం కార్డుల మోసాలు జరిగే అవకాశం ఉంది.

మీ అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటాం

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, ప్రజలు చూపిన అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా వెంకటాపురం గ్రామానికి వేలాది మంది జనం తరలివచ్చారని, ప్రజానేతపై అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలుప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక నుంచి ప్రముఖులు, అభిమానులు వచ్చి ఘన నివాళులు అర్పించారని అన్నారు. ఈ కార్యక్రమం కోసం వారం రోజులపాటు శ్రమించిన పోలీసులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ, శానిటేషన్ సిబ్బంది, వలంటీర్లు, కళాకారులు, భోజనశాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం, రాష్ట్రంలోని టీడీపీ కార్యాలయాలు, ఇతర ప్రాంతాలలో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారని, నివాళులు అర్పించారని, జనం చూపిన ఈ అభిమాన్ని ఎప్పటికీ మరువలేమని అన్నారు. పరిటాల రవి మరణించి 20 ఏళ్లు గడిచినా ప్రజల గుండెల్లో ఇంకా ఆయనకున్న స్థానం చూసి చలించిపోయామని అన్నారు. వర్ధంతికి వచ్చిన జన స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. పరిటాల చూపిన మార్గంలో రానున్న రోజుల్లో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. ఇక నుంచి రవి ఆశయ సాధనలో మరిన్ని అడుగులు పడతాయని, ప్రజల ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరుకుంటునామని వారు అన్నారు.

రేపటి నుంచి బాలికల హాకీ టోర్నీ


అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఫాదర్ ఫెర్రర్ ఏపీ సబ్ జూనియర్ హాకీ బాలికల 13వ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయి. ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తామని హాకీ అనంతపురం జిల్లా కార్యదర్శి అనీల్ కుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, టీడీపీ ధర్మవరం ఇంచార్జి పరిటాల శ్రీరామ్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్ హాజరవుతారని తెలిపారు. 13 జిల్లాల బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 867 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 458 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్పకు బంగారం బిస్కెట్

అజ్ఞాత భక్తురాలి సమర్పణ



హుండీలో లభించిన కాగితం, బంగారు బిస్కట్

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి హుండీలో 10 తులాల బంగారు బిస్కట్ లభించింది. నగరంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్ప దేవాలయంలో శనివారం ఆలయ నిర్వాహకులు హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. మొత్తం రెండు హుండీల్లో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.42,736లు, 10 తులాల బంగారు బిస్కట్ లభించాయి. బంగారం బిస్కట్‌కు చుట్టిన పేపర్‌పై 'ఓం స్వామియే శరణం అయ్యప్ప, అజ్ఞాత భక్తురాలు' అని రాసి ఉంది. ఆలయంలో త్వరలో చేపట్టనున్న విగ్రహ పునఃప్రతిష్ఠాపన నేపథ్యంలో బంగారు కిరీటం, స్వామివారికి బంగారు కవచం చేయించేందుకు దాతల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో అజ్ఞాత భక్తురాలు బంగారు బిస్కట్‌ను హుండీలో వేయడం పట్ల ఆలయ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, పూజారి వాసు, భక్తులు పాల్గొన్నారు.

వదాన్య అశోక్‌కు అరుదైన గౌరవం



అశోక్‌పడపాటి

కొత్తచెరువు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వదాన్యసొసైటీ ద్వారా ప్రజా సేవ చేస్తున్న అశోక్ పడపాటికి అరుదైన గౌరవం లభించింది. రాజభవన్‌లో ఆదివారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ కలెక్టర్ కార్యాలయం ద్వారా సమాచారం పంపారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన అశోక్ పడపాటి వదాన్యసొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడానికి, యువత ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అనేక రకాలైన పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించిన అధికారులు గణతంత్ర వేడుకలకు ఆహ్వానం పంపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మూడు కిలోల మత్తు పదార్థం స్వాధీనం

రాప్తాడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరులకు ఈ వివరాలను డీఎస్పీ తెలియజేశారు. అనంతపురం సాయినగర్ రెండో క్రాస్‌కు చెందిన పూల సునీల్ కుమార్, నవోదయ కాలనీకి చెందిన పోకల విజయ్‌కుమార్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన బండారు శివప్రసాద్, రామకృష్ణ కాలనీకి చెందిన గొల్ల క్రాంతి కుమార్‌రెడ్డి, మంగళవారి కాలనీకి చెందిన బెస్త భాను ప్రకాష్, అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలువకు చెందిన ఎర్రగుంట చంద్రకాంత్ రెడ్డి, తాడిపత్రి పట్టణానికి చెందిన మండ్ల కుళ్లాయప్ప బృందంగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ శ్రీహర్ష, పోలీసు సిబ్బంది నిఘా వేసి, నిందితులను శనివారం అరెస్టు చేశారని తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించామని తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారని తెలిపారు.

బాలయ్యకు.. పద్మ భూషణ్

మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు



పుట్టపర్తి/పుట్లూరు/అనంతపురం అర్బన్/జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ అవార్డు దక్కింది. ఏకకాలంలో సినీ, రాజకీయ రంగాలలో తనదైన ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కళల విభాగంలో ఆయనకు పద్మభూషణ్ పురస్కారం లభించింది. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వారసుడిగా బాలకృష్ణ వెండి తెరపై సత్తా చాటుకున్నారు. తాతమ్మ కలతో మొదలుపెట్టి 109 జానపద, సాంఘిక, పౌరాణిక, చారిత్రక, సందేశాత్మక చిత్రాలలో ఆయన నటించి మెప్పించారు. రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ వారసుడిగా ప్రజా సేవలో ఉన్నారు. 2014లో హిందూపురం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. హ్యాట్రిక్ విజయాలు సాధించారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల అభిమానం చూరగొన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు. అర్ధశతాబ్దపు సినీ ప్రస్థానంలో ఎన్నో విజయాలు సాధించారు. కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

కడవకల్లు బిడ్డ..మాడుగుల



పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఆయన తల్లిదండ్రులు మాడుగుల నాగభూషణ శర్మ, సుశీలమ్మ దంపతులు. 1959లో కడవకల్లులో నాగఫణి శర్మ జన్మించారు. ఈయనకు ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెల్లు ఉన్నారు. మొత్తం 9మందిలో నాగఫణి శర్మ రెండో సంతానం. పదో తరగతి అనంతరం, ఆధ్యాత్మికత వైపు మళ్లారు. తర్వాత ఉమ్మడి జిల్లాలోని కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈయన చదువు కొనసాగింది. పద్మ పురస్కారానికి ఎంపికైన ఆయనకు బంధుమిత్రులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

అభిమానుల సంబరాలు

బాలయ్యకు పద్మభూషణ్ పురస్కారం దక్కిందని తెలియగానే ఉమ్మడి జిల్లాలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొల్లకుంట అంజినప్ప, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు గాజుల ఆదెన్న, టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, గౌస్‌మొద్దీన్, గంజె నాగరాజు, మాజీ మేయర్ స్వరూప హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

బస్టాండ్‌లోకి వెళ్లేదెలా..?

అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాల పార్కింగ్

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



బస్టాండ్‌లోకి వెళ్లకుండా అడ్డంగా పార్కింగ్ చేసిన బైక్‌లు

ధర్మవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాం డ్‌లో ఆవరణంలో బస్సుల ప్లాట్‌పారం వద్దకు వెళ్లే దారిలో ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఇచట వాహనాలు నిలపరాదని బోర్డు ఉంచినా... కొందరు ఆ బోర్డు వద్దే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నా రు. దీంతో బస్టాండ్‌లోకి వెళ్లే వృద్ధులు, వికలాంగులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.అలాగే బస్సుల్లో బస్టాం డ్‌లో వచ్చే దారిలో కూడా రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహ నాలు పార్కింగ్ చేస్తుండటంతో ఆర్టీసీ డ్రైవర్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా దారిలో ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

అనారోగ్యంతో పల్లె ఉమా సోదరి మృతి

పుట్టపర్తి రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ సోదరి మొరంపల్లి పుష్పవతి శనివారం అనారోగ్యంతో మరణించారు. ఆమెకు భర్త లక్ష్మిరెడ్డి, కుమారుడు స్వరూప్ ఉన్నారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పుష్పవతి అంత్యక్రియలను పల్లె వ్యవసాయ క్షేత్రంలోని హార్టికల్చర్ కళాశాల సమీపంలో నిర్వహించారు.

బీసీ వసతి గృహంలో ఆర్వోప్లాంటు ఏర్పాటు


ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న నాయకులు

ధర్మవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీబాలికల వసతి గృహంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. దీన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శనివారం ప్రారంభించారు.

వెంకటరమణాచార్య ఆరాధనోత్సవాలు

ధర్మవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వెంకటరమణాచార్య 13వ ఆరాధనోత్సవాలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకట రమణాచార్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక సిద్ధయ్యగుట్టలోని పరమిత పీఠాధిపతి వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీయోగి ముక్తేశ్వరీ మాతాజీ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిం టెండెంట్ మాధవి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ట్రస్టు వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి రామాంజనేయచారి, ఉపకార్యదర్శి మల్లికార్జున,కోశాధికారి నాగభూషణ, నాయకులు పాల్గొన్నారు.

దోబీఘాట్‌ను మంజూరు చేయించండి

ధర్మవరంరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన రజకులు దోబీఘాట్‌ను మంజూరు చేయించాలని మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి హరీష్‌బాబును కోరారు. ఈ మేరకు శనివారం ఎన్‌డీఏ కార్యాలయంలో అతనికి వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో 70 కుటుంబాలు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని, అయితే ఇప్పటివరకు దోబీఘాట్ లేక ఈ వృత్తిని సవ్యంగా చేసుకోలేకపోతున్నామని అన్నారు. సమస్యను మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనికి హరీష్‌బాబు స్పందిస్తూ తప్ప కుండా మంత్రి దృష్టికి తీసుకెళ్లి దోబీఘాట్‌ను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, రజకులు శ్రీరాములు, గంగాధర్, నాగార్జున, రామాంజినేయులు, ఆది, మణి, వరలక్ష్మీ, రాజేశ్వరి, కమ్మక్క, శివయ్య, శాంతమ్మ పాల్గొన్నారు.

సనాతనధర్మం కోసం పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న లక్ష్మీ నరసింహస్వామి భక్తులు

ఓబుళదేవరచెరువు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం, హిందూవుల్లో ఐక్యత కోసం హిందూపురం రూరల్ మండలంలోని లిం గంపల్లి నుంచి కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు 160 మంది భక్తులు పాద్రయాత్ర చేపట్టారు. శనివారం ఈ పాద యాత్ర ఓడీసీకి చేసుకుంది. వారు మాట్లాడుతూ లింగంపల్లి లక్ష్మీ నర సింహస్వామి కమిటీ కార్యదర్శి టీచర్ జయన్న ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పాతయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గురువారం లింగం పల్లివద్ద ఈ పాదయాత్ర ప్రారంభించామని, శనివారం సాయం త్రానికి కదిరి చేసుకొని.. స్వామివారిని దర్శించుకుం టుమన్నారు. 110కి లోమీటర్ల పాదయాత్ర చేపట్టమని చెప్పారు.

పరిటాల రవి స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు

ముదిగుబ్బ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు మండలంలో నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ తెలిపారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. పరిటాల రవి వర్ధంతిరోజు వడ్డిపేట పాఠశాలలో రేకులషెడ్ ఏర్పాటు చేశామని, పాత ఊరిలో సప్తమాంకాలు నాటకానికి ప్రదర్శించామని, అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేలూరి జయచంద్ర, డిష్ రామాంజి, నరసింహులు, సురేంద్ర, నంద, అబ్దుల్లా, దొరిగిల్లు నరసింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అడిగేదెవరు..?

- ప్రభుత్వ మందులు వృథా..!
- విలేజ్ క్లినిక్ సిబ్బంది నిర్లక్ష్యం
- పంపిణీ చేయడంలో అలసత్వం
- ఆశావర్కర్లకూ ఇవ్వని వైనం
- మందులు దొరక్క రోగుల పాట్లు
- కాలం చెల్లిన తరువాత దహనం
- మండిపడుతున్న గ్రామస్థులు


క్లినిక్ వద్ద బహిరంగంగా దహనం చేసిన మందులు



తంబాపురం విలేజ్ క్లినిక్

బత్తలపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబాపురం విలేజ్ క్లినిక్‌లో ప్రభుత్వం సరఫరా చేసే మందులను సిబ్బంది సక్రమంగా పంపిణీ చేయడం లేదు. ఈ క్లినిక్ పరిధిలో తంబాపురం, జ్వాలాపురం, సంగాల, వరదాపురం, విశ్వనాథ్‌పురం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో అనేక మంది బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ఉన్నారు. ఆ మందుల కోసం తాము ఈ క్లీనిక్ వెళ్తున్నా.. ఎంఎల్‌హెచ్‌పీ మందులు లేవని నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ వెనక్కుపంపిస్తోందని బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వాపోతున్నారు. దీంతో తప్పనివరిస్థితుల్లో తాము బయటి మెడికల్ షాపుల్లో మందులను కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కాగా, అలా పంపిణీ చేయడం కుండా ఉంచిన మందులు, టానిక్‌లు కాలం చెల్లడంతో భారీ మొత్తం వాటిని తంబాపురం విలేజ్ క్లినిక్‌లో ఇటీవల కాల్చివేశారు. అది కూడా మూడు, నాలుగు కుప్పలుగా పోసి.. నిప్పుపెట్టారు. కాలం చెల్లిన మందులు, టానిక్ సీసాలను బయో వేస్ట్‌లో వేసి మాత్రమే కాల్చాలనే నిబంధన ఉన్నా.. దాన్ని పాటించలేదు. అలా టానిక్ సీసాలను బహిరంగంగా కాల్చే సమయంలో అవి పేలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా గ్రామస్థులకు మందులు ఇవ్వకుండా.. కాలం చెల్లిన తర్వాత సిబ్బంది ఇలా కాల్చివేయడంపై ఆ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్లీనిక్‌లోని ఎంఎల్‌హెచ్‌పీ మందులు అడిగితే.. ఇక్కడ మాత్రలు లేవు 104లో తీసుకోండి... లేకుంటే బయట కొనుక్కోండి అని తెగేసి చెబుతోందని ఆరోపిస్తున్నారు. కనీసం గ్రామాల్లో పని చేసే ఆశా వర్కర్లు అడిగినా మందులు ఇవ్వకుండా వెనక్కు పంపుతోందన్నారు. గ్రామాల్లోకి వెళ్లిన ఆశావర్కర్లు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. అందులో పనిచేసే ఓ అధికారి నాలుగు నెలలుగా బీపీ, షుగర్ రోగులను పరిశీలించడానికి తమ గ్రామానికి రాలేదని జ్వాలాపురం గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో తాము బత్తలపల్లిలోని ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నామని వాపోయారు. విలేజ్ క్లీనిక్‌లో మందులు అడిగితే తీవ్ర పదజాలంతో మండిపడుతున్నారని ఆరోపించారు.

మందులు సరఫరా చేస్తున్నాం

బీపీ, షుగర్, ఇతర మందులను తంబాపురం విలేజ్ క్లినిక్‌కు సరపరా చేస్తున్నాం. కాలం చెల్లిన మాత్రలు ఎక్కడపడితే అక్కడ కాల్చకూడదు. పీహెచ్‌సీలోని బయో వేస్ట్‌లో వేసి మాత్రమే కాల్చాలి. అలా కాకుండా ఎక్కడ బడితే అక్కడ కాల్చితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

- తేజాశ్రీ, మండల వైద్యాధికారి

నేడు పౌరాణిక నాటక ప్రదర్శన

కదిరిఅర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పట్నం గ్రా మంలో నందా ఆర్ట్స్ అండ్ కల్చరల్ డైవలంప్‌మెంట్ సొసైటీ ఆధ్వ ర్యంలో పౌరాణిక నాటకాన్ని ఆదివారం ప్రదర్శిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు జయప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భాషా, సంస్కృతిక శాఖ , సంస్కృతి సమితి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రామాంజనేయ యుద్ధం, చింత మణి భవాణీ, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర, మాయలపక్కీర్ నాటకాలు ప్రదర్శిస్తున్నామన్నారు. అలాగే చెక్కభజన, కోలాటం ప్రదర్శిస్తా మన్నారు. ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పొగ మంచుతో ఇక్కట్లు



బత్తలపల్లి జనవరి 25(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి ప్రాంతాన్ని శనివారం పొగమంచు కప్పేసింది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా పొగమంచు దట్టంగా ఉండటంతో.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో .. వాహదారులు లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లడం కనిపించింది. వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

క్రైం న్యూస్ ..

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి


రామక్రిష్ణ (ఫైల్)

బత్తలపల్లి జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లమార్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రామక్రిష్ణ (56) మరణించాడు. అతను తన ద్విచక్ర వాహనంలో శుక్రవారం బత్తలపల్లికి వచ్చాడు. తిరిగి వెళ్తూ గ్రామంలోకి వెళ్లగానే కుక్క బైక్‌కు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి... కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. రామక్రిష్ణకు భార్య శివమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, రాష్ట్ర డెవలప్‌మెంట్ ఫైనాన్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఆ గ్రామానికి వెళ్లి.. రామక్రిష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఏకగ్రీవం


ఏకగ్రీవంగా ఎన్నికైన పోతుకుంట గొర్రెల పెంపకందారుల సంఘం సభ్యులు

ధర్మవరంరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంటకు చెందిన శ్రీమహేశ్వరి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు శనివారం ఆ గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి డాక్టర్ రమాదేవి తెలిపారు. అధ్యక్షుడిగా గవ్వల రామాంజినేయులు, ఉపాధ్యక్షుడిగా చిత్రానారా యణస్వామి, డైరెక్టర్లుగా ఇస్మాయిల్, నరసింహులు, జీ.నాగప్ప, కొంకా నాగభూషణ, బండిశివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన సభ్యులను టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, గ్రామాధ్యక్షుడు రాకెట్ల నరసింహులు, నాయకులు రవి, రమేష్, సన్న, ఐటీడీపీ రాము, నారాయణస్వామి, గవ్వల తిరుమలయ్య సన్మానించారు. అలాగే నడిమిగడ్డపల్లిలో శ్రీలక్ష్మీ గణేష్ గొర్రెల పెంపకందారుల సంఘాన్నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జరిగినట్లు ఎన్నికల అధికారి డాక్టర్ స్వర్ణలత తెలిపారు. అధ్యక్షుడిగా పుల్లప్ప, ఉపాధ్యక్షుడిగా పెద్దన్న, డైరెక్టర్లుగా నారాయణస్వామి, విజయ్, కాటమయ్య, మస్తానప్ప, చెన్నయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

● ముదిగుబ్బ : ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా శనివారం ఎంపిక చేసినట్టు ఎన్నికల అధికారి డాక్టర్ మల్లికార్జున తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తియాదవ్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, డైరెక్టర్లను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారికి ఎన్నికల అధికారి నియామక పత్రాన్ని అందజేశారు.


పీడీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

'ఉపాధిహామీ'లో రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలి

పుట్టపర్తిరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల పనులలో రాజకీయ నాయకుల ఒత్తిళ్ళు తగ్గించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్‌చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఉపాధిహామీ కార్యా లయంలో పీడీ విజయేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కల్పించి వలసలు నివారించాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200రోజులకు పెంచి రోజుకు 700 రూపాయలు కూలీ చెల్లించాలన్నారు. జాబ్‌కార్డుతో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతిఒక్కరికి పనికల్పించాలని, సకాలంలో కూలీ వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలస్వామి, కుళ్ళాయప్ప, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అడవుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్డీఓ మహేశ్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ప్రొటెక్షన్ ఆఫ్ ఫారెస్ట్ ల్యాండ్స్, యాక్ట్‌కు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ భూముల ఆక్రమణలు అడ్డుకోవడం, అటవీ భూముల రక్షణ, అడవిలో మంటల నివారణ తదితర అంశాలను చర్చించారు.అడవులను కాపాడేందుకు కృషిచేయాలని సూచించారు. అడవుల ప్రాముఖ్యతను, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్డీఓ, అటవీశాఖ అధికారులు

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తిరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన వాసవీ ఇంగ్లీషు మీడియం స్కూల్ చిన్నారులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలకు పట్టణవాసులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ఎన్‌రోల్‌మెంట్‌లో మెరుగైన పనితీరును కనబరిచిన ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను అవార్డు వరించింది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ చేతులమీదుగా శనివారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్నారు. దీంతో ధర్మవరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

అలరించిన భక్తిగీతాలు


పాటలు పాడుతున్న సాయియువత

పుట్టపర్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సత్యసాయి యువత భక్తిగీతాల ఆలాపనతో భక్తులను అలరించారు. రెండో రోజు శనివారం సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో శ్రీసత్యసాయి లీడర్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. యువత ప్రేమకీ పరిభాష పేరిట సంగీత గాన కచేరిని నిర్వహించారు. గంట పాటు భక్తి గీతాలతో భక్తులను తన్మయత్వం చెందించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



ధర్మవరం : ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీఓ

ధర్మవరం/రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ఎక్కువసార్లు ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధులను ఆర్డీఓ మహేష్ సత్కరించారు. నూతన ఓటర్లకు ఓటరు కార్డులను అందజేశారు. ధర్మవరంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, పద్మావతి మహిళ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆదిశేషు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సచివాలయ ఉద్యోగులకు కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ బహుమతులు అందజేశారు.

● కదిరిఅర్బన్ : బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఎల్ పార్థసారధి నివాసంలో సంవిధాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్లనుసన్మానించారు.

● అలాగే గాండ్లపెంట, నంబులపూలకుంట, ఓబుళదేవరచెరువు, బుక్కపట్నం, తనకల్లు, ముదిగుబ్బ, నల్లమాడ తదితర ప్రాంతాల్లోనూ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు

ధర్మవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, పోలీసులు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన రహదారుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. నూతన డీఎస్పీ హేమంత్ కుమార్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, రామగిరి సీఐలు నాగేంద్ర ప్రసాద్, రెడ్డప్ప, శ్రీదర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

న్యూస్ బాక్స్

అందరికీ ఆమోదయోగ్యంగా భూ పరిహారం



గ్రామసభలో పాల్గొన్న పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ

గోరంట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ, కోడూరు ఎన్‌హెచ్ 342 రోడ్డు విస్తరణకు అవసరమైన భూమికి అందరికీ ఆమోదయోగ్యంగా ప్రభుత్వం పరిహారం అందచేస్తుందని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మందలపల్లి సచివాలయంలో భూ సేకరణ కోసం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. భూముల మార్కెట్ విలువ, గత మూడేళ్లలో జరిగిన క్రయ విక్రయాల ఆధారంగా భూమికి పరిహారం నిర్ణయిస్తారన్నారు. గ్రామసభల్లో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మారుతి ఇదే రహదారికోసం గోరంట్ల, మల్లాపల్లి, బూదిలి గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ రైతులతో మాట్లాడి వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో విఆర్ఓ పవన్, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఆయాగ్రామ విఆర్ఓలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

పెనుకొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఏపీజేఏసీ జిల్లా ఛైర్మన్ షైనుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏపీజేఏసీ సత్యసాయిజిల్లా ఈసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన షైనుద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గిరిధర్, జిల్లా వైస్ ఛైర్మన్ ప్రభావతి, ఇతర మహిళా ఉద్యోగులు హాజరయ్యారు.

పీహెచ్‌సీ తనిఖీ

సోమందేపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. అటెండెన్స్ రిజిష్టరును తనిఖీ చేశారు. టీకాలు నిలువ ఉంచిన కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణీలు, పిల్లలకు అందిస్తున్న టీకాల వివరాలను డాక్టర్ ఓంకార్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు విధినిర్వహణపట్ల ఆరాతీశారు. అనంతరం సిబ్బందికి టీకాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మనోహర్ రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ మునీర్

చిలమత్తూరు, జనవరి25(ఆంధ్రజ్యోతి):హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం ప్రమాదకరమని ఎస్ఐ మునీర్ అహమ్మద్ పేర్కొన్నారు. శనివారం ఆయన కొడికొండ చెక్‌పోస్టు నుంచి చిలమత్తూరు వరకు హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవలసి వస్తోందన్నారు. వాహన చట్టం ప్రకారం వాహనంపై వెళ్లే వారు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని గమనించి ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన యువకులతో కలిసి హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

అగళి, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : అగళి మండలంలోని బీసీ, ఈబీసీ, బ్రాహ్మణ, వైశ్య, కాపు, మైనార్టీ, కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొందేందుకు ఓబీ ఎంఎంఎస్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ఇందుకు 21సంవత్సరాల నుంచి 60సంవత్సరాల లోపు వయసు కలిగినవారు అర్హులన్నారు. ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు. బీఫార్మసి పూర్తిచేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు

హిందూపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : గణతంత్ర్యవ వేడుకలు పురస్కరించుకుని ఆదివారం పట్టుగూళ్లమార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు సిరికల్చర్ ఏడీ సురేష్ తెలిపారు. నేడు పట్టుగూళ్ల క్రయ విక్రయాలు ఉండవని పట్టు రైతులు గమనించాలని సూచించారు. సోమవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయన్నారు.

నేడు మాంసం విక్రయిస్తే కేసు నమోదు చేస్తాం

గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం హిందూపురం పట్టణంలో మాంసం విక్రయాలు నిషేధించినట్లు మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొంకల్లు, కురబరపల్లి, బి.టి.పల్లి, హిరేతుర్పి, గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజాది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు.

పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) రైతులు పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డీడీ పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొల్లహట్టి గ్రామంలో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ పెంచలయ్య మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే పశువైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

మడకశిరటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో కొత్తగా భవనాలు నిర్మించేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కమీషనర్ రంగస్వామి అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్‌ఫోరం నిర్వహించారు.

గుంతలమయమైన జయమంగళి

● అనుమతులు ఇక్కడికే.. విక్రయాలు కర్ణాటకలో

● ఆగని ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

పరిగి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని జయమంగళి, పెన్నానదుల నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్లలో ఇసుక కర్ణాటకకు తరలిపోతోంది. ఇసుకాసురులు బ్రేక్ లేకుండా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ చర్యలతో నదీ ప్రాంతమంతా గోతులమయంగా మారింది. ఇసుక తరలిస్తే భూమి జలాన్ని నిల్వ చేసుకొనే శక్తిని కోల్పోతుంది. దీంతో ఈ ప్రాంతంలో బోర్లన్నీ ఎండిపోయి, నదీ తీర ప్రాంతంలో పంటలు పండించే రైతులు నష్టపోతున్నారు.

మండలంలోని పరిగి, నేతలపల్లి, బోరెడ్డిపల్లి, ఊటకూరు, పైడేటి, ముళ్లమోతుకపల్లి, శ్రీరంగరాజులపల్లి, ఇసుక దందాకు మారుపేరుగా మారాయి. ప్రభుత్వం నిర్దేశించిన సూచనలు ఎక్కడా పాటించన పాపాన పోవడంలేదు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుకను రిజిష్టరులో నమోదుచేసుకుని స్థానికంగా మాత్రమే ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లాలి. కాని ఇందుకు వ్యతిరేకంగా పగలు, రాత్రి తేడాలేకుండా ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలిస్తున్నారు. అడ్డొచ్చిన రైతులను రౌడీయిజంతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఇసుకను డంప్‌చేసుకుని రాత్రికి రాత్రే టిప్పర్లద్వారా బెంగళూరుకు తరలిస్తున్నారు. అక్కడ ఒక ట్రాక్టర్ రూ.2500, టిప్పర్ రూ.40వేలు చొప్పున విక్రయిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా అధికార పార్టీ రాజకీయ నాయకుల కారణంగా చూసీ చూడనట్లుగా పోతున్నారు. గట్టిగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే చూస్తాం..చేస్తాం అంటూ కాలక్షేపం చేస్తున్నారు.

మరోవైపు నదులలో ఇసుక తరలింపువల్ల నీటి శాతం తగ్గి బోర్లలో నీరు రావడంలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వస్తున్న ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

స్థానిక ప్రజలకు అన్యాయం చేస్తున్నారు



లింగారెడ్డి, బోరెడ్డిపల్లివాసి

మండలంలోని స్థానిక ప్రజలు ఓ వైపు ఇసుక లేక ఇబ్బందులు పడుతుంటే ఇతర ప్రాంతాల ట్రాక్టర్ యజమానులు ఇందుకు విరుద్ధంగా చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కర్ణాటకకు ఎక్కువమొత్తం ఇసుక తరలిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. స్థానికప్రజలకు అన్యాయం చేస్తు న్నారు. దీనిని అరికట్టి రైతులకు న్యాయం చేయాలి

నివాస గృహాలపై 11 కేవీ విద్యుత్ లైను

● తెగిపడుతున్న తీగలు ● భయాందోళనలో ప్రజలు



చిన్నప్పరెడ్డిపల్లి బీసీ కాలనీలో ఇళ్లపై వెళుతున్న 11కే.వి లైను

చిలమత్తూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తమ నివాస గృహాలపై 11కేవి విద్యుత్ లైను వెళ్లడంతో నిత్యం భయాందోళనలో బ్రతకాల్సి వస్తోందంటున్నారు కోడూరు పంచాయతీ చిన్నప్పరెడ్డిపల్లి బీసీ కాలనీ వాసులు. కోడూరు నుంచి మధురేపల్లి, మొరంపల్లి గ్రామాల వరకు 11కేవి విద్యుత్ లైను ఉంది. ఈ లైను పూర్తిగా చిన్నప్పరెడ్డిపల్లి బీసీ కాలనీ మీదుగా వెళుతోంది. నివాస గృహాలను విద్యుత్ తీగలు తాకుతూ వెళుతుండటంతో నిత్యం ప్రమాదభరితంగా మారింది. ఇంటిపైకి వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని కాలనీ వాసులు అంటున్నారు. రెండు రోజుల క్రితం ఇదే కాలనీలో విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో విద్యుత్ తీగ ఒకటి తెగిపడింది. అయితే అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇది గత 50 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన విద్యుత్ లైను. అప్పటి నుంచి విద్యుత్ లైనుకి ఏర్పాటుచేసిన తీగలను మార్చలేదు. దాంతో అవి బాగా తుప్పుపట్టి తరచూ తెగి కిందపడుతున్నాయి. వెంటనే నివాస గృహాలపై నుంచి వెళుతున్న విద్యుత్ లైనును పక్కకు మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. దీనిపై ఏఈ జయవర్ధనరెడ్డిని వివరణ కోరగా ఈ విషయాన్ని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లామని, నెల రోజుల్లో కాలనీ మీదుగా వెళుతున్న విద్యుత్ లైనుని పక్కకు మార్చే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల చేతిలో ఓటే వజ్రాయుధం

హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మండలకేంద్రాల్లో శనివారం ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీలు జరిగాయి.



ఓటరు కార్డులు అందజేస్తున్న పెనుకొండ ఆర్డీఓ, డీఎస్పీ

పెనుకొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజల చేతిలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

హిందూపురం:పట్టణంలో ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్, మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, సిరికల్చర్ ఏడీ సుధాకర్ పాల్గొన్నారు

పరిగి : మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్ హసీనాసుల్తానా ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచంలో అన్నిదేశాలకంటే మన రాజ్యాంగం బలమైందని ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛను ఇచ్చిన రాజ్యాంగం మనదని బీజేపీ నాయకులు పార్థసారధి, నాయకులు ఆదర్శ్, ఉదయ్, తదితరులు అన్నారు.

లేపాక్షి: ఓటును అమ్ముకోవద్దని దానిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నంది విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ప్లకార్డులతో విద్యార్థులు నినాదాలు చేశారు.



నంది విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

గోరంట్ల:ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఖజాపురం కేజీబీవి పాఠశాలలో కార్యక్రమానికి తహసీల్దార్ మారుతి హాజరై, గెలుపొందిన విద్యార్థుకు ప్రశంసా పత్రాలు అందించారు.

చిలమత్తూర :ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంలాంటిదని దానిని ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని మండల డిప్యూటి తహసీల్దార్ జగన్నాథం పేర్కొన్నారు.

సోమందేపల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మాగేచెరువు పంచాయతీలో నాయకులు వెంకటరాముడు, నరసింహులు ప్రజలకు ఓటుహక్కు ఔన్నత్యాన్ని వివరించారు.

మడకశిర రూరల్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని మడకశిరలోని అన్ని కళాశాలల్లో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దేశ తలరాతలు మార్చే ఆయుధం ఓటు అని, దానిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఓ గౌరీశంకర్ అన్నారు.

అగళి: అగళి మండల కేంద్రంలోని గుప్త కళాశాల విద్యార్థులతో అగళి తహసీల్దార్ సుబ్బారావు ఓటర్ల దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు.

రొళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.

గుడిబండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రామ్‌భూపాల్‌రెడ్డి, ఎంజేపీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

దళితుడిపై దాడి కేసులో మాజీ సర్పంచ్ అరెస్టు

గోరంట్ల, జనవరి25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నార్సింపల్లికిచెందిన దళితుడైన లారీ డ్రైవర్ ఆంజనేయులుపై జరిగిన దాడి కేసులో మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వెంకటశివారెడ్డిని శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై ఓ మైనర్ బాలిక బంధువులు మూడు రోజులక్రితం దాడిచేసి, కొట్టిన విషయం తెలిసిందే. దీంతో అమ్మాయి బంధువులు, తదితరులుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శుక్రవారం ఏడుగురిని పెనుకొండ డిఎస్పీ వెంకటేశ్వర్లు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఆ కేసులో నార్సింపల్లి మాజీ సర్పంచ్ వైసీపీ నాయకుడు, వెంకటశివారెడ్డిని డిఎస్పీ శనివారం అరెస్టు చేసి, పెనుకొండ కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ శేఖర్ తెలిపారు. కోర్టు ఆయనకు 15రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన వివాహిత ఆసియా కుటుంబ కలహాలతో క్రిమిసంహార మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త మందలించడంతో ఆమె సూపర్‌వాజ్‌మోల్ ద్రావకంతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆమెను వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తీసుకురాగా చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలించారు.

వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయండి

మడకశిరటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని ఏఆర్‌రొప్పం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు వడ్డెరసంఘం నాయకులు మాజీ మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ రఘురాం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డె నాగరాజు, నాయకులు బాబన్న కోరారు.

శివమాలధారుడిపై దాడి

● రోడ్డెక్కిన హిందూ సంఘాలు ● పెనుకొండలో ఉద్రిక్తత



దర్గాసర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న హిందూసంఘాల నాయకులు

పెనుకొండ టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పెనుకొండకు చెందిన శివమాల ధరించిన భక్తుడిపై మరో సామాజికవర్గానికి చెందిన వ్యక్తి దాడిచేసిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే పెనుకొండ పట్టణంలోని దర్గా సర్కిల్‌వద్ద ఎప్పటిలాగే మాల ధరించిన శివ ఆటో పెట్టుకున్నాడు. అదే సమయంలో మరో సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అటువైపు కారులో వచ్చి రోడ్డుపై ఆటో అడ్డుతీయమన్నాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటన తెలుసుకున్న వీహెచ్‌పీ, హిందూ సంఘాలు పెద్దఎత్తున దర్గాసర్కిల్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివమాల ధరించిన వ్యక్తిపై దాడిచేసిన వ్యక్తి వచ్చి క్షమాపణ చెప్పాలంటూ పట్టుబట్టారు. ఆయన రాకపోతే ధర్నా విరమింపజేసేది లేదని రోడ్డుపై కూర్చున్నారు. ఈ ఘటన తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున దర్గాసర్కిల్‌లో మొహరించారు. ఈ సంఘటన నేపథ్యంలో పెనుకొండలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



సంచారజాతుల పిల్లలకు క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

గోరంట్ల, జనవరి25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పులేరు రోడ్డులో గుడారాలు వేసుకుని నివాసముంటున్న సంచార జాతి పిల్లలకు ఆర్‌డిటి వారు శనివారం క్రాడా సామాగ్రి పంపిణీ చేశారు. సంచార జాతివారు చాల యేళ్లుగా నివాసముండడంతో వారి పిల్లలో విద్యాప్రమాణాలు పెంచడానికి కొంతకాలంగా ఉపాధ్యాయుడు దేవాగం జగదీశ్వర్ అక్షరజ్యోతి శిక్షణా కేంద్రం ఏర్పాటు చేశారు తద్వారా ప్రతిరోజు ఉదయం, రాత్రి సమయంలో విద్యాబుద్దులు నేర్పిస్తున్నారు. విషయం తెలుసుకున ఆర్‌డిటి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ పాఠశాలను సందర్శంచి విద్యార్థులు, తల్లిదండ్రుతో మాట్లాడారు. వారిలో క్రీడాస్ఫూర్తిని పెపొందించడానికి వివిధరకాల క్రీడా సామాగ్రిని అందించారు.భవిష్యత్‌లో వారికి అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానన్నారు వారు ఎంతగానే సంతృప్తి వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు జగదీశ్వర్, ఆర్‌డిటి ఎటిఎల్ నరసింహరావు, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్, తదితరులున్నారు.

గాయపడిన జింక.. అటవీ శాఖకు అప్పగింత



జింకను అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్న దృశ్యం

రొళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమంతనపల్లి గ్రామం వద్ద పంట పొలాల్లో అడవి నుంచి వచ్చిన జింకను శనివారం కుక్క వెంబడించి కరిచింది. ఈవిషయమై హనుమంతనపల్లి గ్రామానికి చెందిన నవీకుమార్ చారవాణి ద్వారా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. వెంటనే ఎఫ్‌బీఓ సంజీవరాయుడు స్పందించి ఘటన స్థలానికి చేరుకొని జింకను పరిశీలించి స్థానిక పశు వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మడకశిర పశువైద్యశాలకు తరలించారు. ఈసందర్భంగా వన్యప్రాణులను వేటాడే వారి సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని అడవిని వన్యప్రాణులను కాపాడే బాధ్యత అందరిదని తెలిపారు.

పీఎల్‌డీ బ్యాంక్ డైరెక్టర్‌గా గోవిందప్ప ఎన్నిక



గోవిందప్పను అభినందిస్తున్న నాయకులు

పావగడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పీఎల్‌డి బ్యాంక్ నూతన డైరెక్టర్‌గా కెంచగానపల్లి గ్రామానికి చెందిన ఎస్‌వి గోవిందప్ప ఎన్నికయ్యారు. తాలూకా వ్యాప్తంగా పీఎల్‌డీ బ్యాంక్ కు 14మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉండగా ఎన్నికలకు అయ్యే ఖర్చులను వృధా చేయకుండా కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు రెండు కలిసి 13మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే నాగలమడక క్షేత్రానికిగాను శనివారం ఎన్నికలు జరగ్గా మొత్తం 37మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గోవిందప్పకు 14ఓట్లు, అనిత 13, చిరంజీవి 10 ఓట్లు వచ్చినట్లు తెలిపారు. వరుసగా నాలుగుమార్లు ఏకగ్రీవమైన గోవిందప్పను కాంగ్రెస్ నాయకులు, జేడీఎస్ నాయకులు కలిసి అభినందించారు.

ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు

మడకశిర రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మణూరు పంచాయితీ కేంద్రంలో శనివారం యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు మారుతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మణూరు.సుంకరెడ్డిపల్లి, చాపర్లపల్లి, ఎం రంగాపురం, గ్రామాల నుంచి మహిళలు జ్యోతులతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరం

గుడిబండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దనకుంట, కె.కె.పాళ్యం గ్రామాల్లో పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో శనివాంం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో 5048 గొర్రెలు, మేకలకు టీకాలు వేసి నట్టల నివారణ మందును వేశారు. అదేవిధంగా పాడిఆవులను గర్భకోశ పరీక్షలను నిర్వహించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



సత్యనారాయణ (ఫైల్)

హిందూపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ కిరికెర మాజీ సర్పంచ్ సత్యనారాయణ(61) శనివారం మృతిచెందాడు. ఆయన కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన 2008నుంచి 2013వరకు కిరికెర సర్పంచ్‌గా పనిచేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. ఈయన మృతిపట్ల పలువురు రాజకీయ పార్టీ నాయకులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.